సాక్షి
కర్నూలు
ఆదివారం ၊ 26 ၊ జనవరి ၊ 2025




మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శనివారం నందికొట్కూర్‌కు చెందిన లిక్షితాశ్రీ నృత్యకళాశాల కళాకారులు శైవ గీతాలకు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు.



ఆదాయం రూ. 2.88 లక్షలు

బేతంచెర్ల: మద్దిలేటయ్యక్షేత్రానికి శనివారం వివిధ సేవల ద్వారా రూ.2,88,115 ఆదాయం వచ్చింది. భక్తులకు ఆలయ అర్చకులు నామ ధారణ, తీర్థ ప్రసాద వితరణ చేశారు.



గణతంత్రం.. స్వేచ్ఛా జీవనం

మహనీయుల త్యాగం ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. రాజ్యాంగం కల్పించిన హక్కులతో స్వేచ్ఛగా.. అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్నాం.

IIలో▸

న్యూస్‌రీల్

పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ది

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ బి.కబర్ది అన్నారు. జిల్లాన్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో న్యాయాధికారులు, న్యాయ శాఖ సిబ్బందికి కర్నూలు న్యాయ సేవా సదన్‌లో శనివారం ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ క్యాంపును ప్రారంభించారు. కంటి, బీపీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ క్యాంపులో వైద్య సేవలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యధికారులు, అశ్విని హాస్పిటల్, మెడికవర్ వైద్యులు చేపట్టారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అడిషినల్ జడ్జీలు పాండురంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, శాశ్వతలోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, జిల్లా మెడికల్‌అండ్ హెల్త్ ఆఫీసర్ శాంతికళ పాల్గొన్నారు.

'ఏటీఎం' సాగుతో ఏడాదంతా సిరులే



ఏటీఎం సాగును పరిశీలిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: ఏటీఎం మోడల్ వ్యవసాయంతో సంవత్సరంలో అన్ని రోజులు ఆదాయం పొందవచ్చని రైతు ఆనంద్ తెలిపారు. వెల్దుర్తి మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగైన ఏటీఎం పంటలను శనివారం ఫ్రాన్స్ దేశ నివాసి రేణుక, గుంటూరులోని ఈవీఎస్ రాష్ట్ర కార్యాలయం జనరల్ మేనేజర్ మన్మోహన్ పరిశీలించారు. ఏటీఎం పద్ధతిలో సాగు చేస్తున్న 32 రకాల పంటలపై ఆరా తీశారు. వీరి వెంట ఎస్‌ఎఫ్‌ఏ అబ్దుల్ బాసిత్, ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్‌లు జనార్దన్, మునిరాజు, ఐసీఆర్‌పీలు రవి, అయ్యస్వామి, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, మధు, రామచంద్రుడు ఉన్నారు.

కలెక్టర్‌కు బెస్టు ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కలెక్టర్ పి.రంజిత్‌బాషా బెస్టు ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా అందుకున్నారు. శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ అవార్డును అందుకున్నారు. బాపట్ల కలెక్టర్‌గా ఉన్న సమయంలో 2024 ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణలో చూపిన ప్రతిభకు ఆయన ఈ అవార్డుకు ఎంపికైన విషయం విదితమే.

చుట్టు పక్కల చూడరా..!

సండే స్పెషల్

- నాటి అనుబంధాలు, ఆత్మీయతలు కరువు
- ఎవరికి ఎవరో అన్నట్లు జీవనం
- ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడమే కారణం
- ఇరుగు పొరుగు పలకరించుకోని వైనం
- ప్రస్తుత పరిస్థితులపై ఆవేదన వ్యక్తం చేస్తున్న నాటి పెద్దలు



కర్నూలు(హాస్పిటల్): మానవ సంబంధాల పేరుతో మనిషన్నవాడు మాయమవుతున్నాడు. అందరూ బాగుంటేనే సమాజం అన్న ధోరణి నుంచి నా కుటుంబం బాగుంటే చాలనే ధోరణితో జీవిస్తున్నాడు. ఈ క్రమంలో చివరికి తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్లను సైతం దూరం చేసుకుంటున్నాడు. కేవలం భార్యాబిడ్డలు బాగుంటే చాలని అనుకుంటున్నారు. ఒకప్పుడు పక్కింట్లో పెళ్లంటే ఆ వీధిలో ఉన్న వారందరూ తలోచేయి వేసి ఇంట్లో మనుషుల మాదిరిగా పనులు చేసేవారు. ఇప్పుడు అయిన వారు కూడా చుట్టపుచూపుగా వస్తున్నారు. అయిన వారు అందరూ ఉన్నా పనులన్నీ ఈవెంట్ మేనేజర్లు చూసుకుంటున్నారు. పట్టణీకరణ పేరుతో మనుషులు దూరం అవుతున్నారు. కానీ ఇప్పటికీ పల్లెలు, పట్టణాల్లోని మురికివాడల్లో ఒకప్పటి అనుబంధాలు, ఆత్మీయతలు కొనసాగుతుండటం గమనార్హం. ఉన్నత చదువులు, పెద్ద పెద్ద ఉద్యోగాలు మనుషులను దూరం చేయడానికా లేదా దగ్గర చేయడానికా అని ఆనాటి పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం ఎవ్వరికైనా ఏదైనా కష్టం వస్తే బంధువుల కంటే ముందు ఇరుగుపొరుగు వారే ముందుగా వచ్చి ఆదుకునేవారు. ఇంట్లో ఎవ్వరైనా చనిపోతే పక్కింటి వారే ఆ కుటుంబానికి అవసరమైన ఏర్పాట్లు చేసేవారు. ఇప్పుడు అపార్ట్‌మెంట్‌లలో, అద్దె ఇళ్లల్లో సైతం మృతదేహాన్ని ఉండనీయని పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, చిన్న కుటుంబాలు ఏర్పడటం, చిన్నతనంలో పిల్లలను హాస్టల్‌లో, వృద్ధాప్యంలో పెద్దలను ఆశ్రమాల్లో ఉంచడంతో కుటుంబ విలువలు తగ్గిపోతున్నాయి. ఉన్నత చదువుల పేరుతో ఆధునికత సంతరించుకోవడంతో ఎవ్వరికి వారే అన్న రీతిలో సమాజంలో జీవిస్తున్నారు.

కర్నూలు నగరానికే చెందిన రాజ్ కుమార్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. మూడేళ్ల క్రితం అతని తల్లి అనారోగ్యంతో మరణించింది. విషయం తెలిసిన ఇంటి యజమాని మృతదేహాన్ని 'మా ఇంట్లో ఉంచొద్దని, మీ బంధువుల ఇళ్లకు తీసుకెళ్లు' అని గొడవ చేశాడు. ఎంత నచ్చజెప్పినా వినలేదు. దీంతో తప్పనిసరై నగరంలోని తన సోదరుని ఇంటికి అప్పటికప్పుడు మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

నంద్యాల పట్టణంలో ఇటీవల ఓ వ్యక్తి తన కుమారుడి వివాహం చేశారు. బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఎక్కువ మంది వస్తారని పెద్ద ఫంక్షన్ హాల్, పెళ్లి భోజనంలో రకరకాల స్వీట్లు, వంటకాలు ఏర్పాటు చేశారు. అయితే పెళ్లి ముందు రోజు కూడా పెద్దగా బంధువులు, మిత్రులు రాలేదు. తలంబ్రాల సమయానికి హడావుడిగా వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించి తెచ్చిన గిఫ్ట్‌లను చేతిలో పెట్టి వెళ్లిపోయారు. ఆహార పదార్థాలు భారీగా మిగిలిపోవడంతో అనాథ్రశమానికి పంపించేశారు.

సమాజంలో ప్రస్తుతం మానవ సంబంధాలు ఎలా ఉన్నాయో ఈ సంఘటనలే నిదర్శనం.

ఎమ్మిగనూరుకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి పిల్లల చదువుల కోసం కర్నూలులో ఉంటున్నారు. ఆ వీధిలో అతను దాదాపు పదేళ్లుగా ఉంటున్నాడు. అయితే చుట్టు పక్కల వారితో ఇంత వరకు ఆయన మాట్లాడలేదంటే ఆశ్చర్యం కలగక మానదు. ఉదయాన్నే విధులకు వెళ్లడం, సాయంత్రం ఇంటికి రావడం, కుటుంబీకులతో గడుపుతారు. పక్క ఇళ్లల్లో శుభకార్యం జరిగినా వెళ్లింది లేదు.. ఆపద వచ్చినా పలకరించింది లేదు.

కష్టమొస్తే భరోసానిచ్చే చేతుల్లేవు..



నాగరికత వెంట పరుగులు పెడుతున్న మనుషుల మధ్య దూరం మరింత పెరుగుతోంది. ఉన్నత చదువులు, ఉద్యోగాల పేరుతో ఎవ్వరికి వారు వేరుగా ఉండేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లో 40కి పైగా కుటుంబాలున్నా.. కష్టమొస్తే పలకరించేవారు ఎవ్వరూ రాని పరిస్థితి నెలకొంది. కానీ పండుగలు, చిన్నచిన్న శుభకార్యాలు మాత్రం చేసుకుని ఎంజాయ్ చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఎవ్వరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే అయిన వారే పలకరించే దిక్కులేదు. బంధువులు, స్నేహితులు సైతం సోషల్ మీడియాలో మాత్రమే పరామర్శలు చేస్తున్నారు. ఇంటికి వచ్చి ధైర్యం చెప్పేవారు కరువైపోయారు.

పలకరించి ఎన్నాళ్లైందో..



ఒకప్పుడు ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తే గంటల తరబడి మాట్లాడుకుంటూ ఉండిపోయేవారు. సమయానికి భోజనం చేయాలన్న విషయం కూడా మరిచిపోయేవారు. కుటుంబంతో పాటు ఊళ్లో, సమాజంలో ముచ్చట్లు, రాజకీయాలు, సినిమాలు అన్నీ ఈ మాటల్లో కనిపించేవి. కానీ ఇప్పుడు ఇంటికి ఎవ్వరైనా వస్తే ముఖస్తుతిగా పలకరించి రెండు నిమిషాలు మాట్లాడి వదిలేస్తున్నారు. ఎవ్వరి మొబైల్‌లో వారు బిజీగా గడుపుతున్నారు. ఎదురుగా ఉన్న వారిని పలకరించే సమయం లేకపోయినా ఎక్కడా కనిపించని వారిని సోషల్ మీడియాలో పలకరించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

నిలవని ప్రేమ వివాహాలు..



తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమవివాహాలు చేసుకోవడం ఇటీవల కాలంలో అధికమైంది. కొందరు తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుంటుండగా మరికొందరు ఇంటి నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకుంటూ వేరుగా ఉంటున్నారు. ఆ తర్వాత ఏడాది, రెండేళ్లకే విడిపోయి తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేరుకుంటున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో వారానికి రెండు, మూడు కేసులైనా అమ్మాయి మిస్సింగ్ అని నమోదవుతున్నాయి. ఇలాంటి ఘటనలు ఇటీవల అధికంగా చూస్తున్న పోలీసులు చాలా మంది అమ్మాయిని వెతకడం అటుంచి రెండురోజులకు వారే వస్తారులే అన్న ధోరణితో మాట్లాడుతున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటల్లో వచ్చే చిన్న చిన్న మనస్పర్థలను సర్దిచెప్పేవారు లేక రెండు, మూడేళ్లకే విడిపోతున్నారు. పోలీస్ స్టేషన్‌లు, వన్‌స్టాప్ సెంటర్లు, ఐసీడీఎస్ కార్యాలయాల్లో ఇలాంటి వారికి కౌన్సిలింగ్ నిర్వహించే ఉదంతాలు ఇటీవల అధికమయ్యాయి.

నాటి ఆత్మీయతలు ఇప్పుడు లేవు



నాకు ఇప్పుడు 61 సంవత్సరాల వయస్సు. నా చిన్నతనంతో పోలిస్తే ఇప్పటి తరంలో అనుబంధాలు, ఆత్మీయతలు బాగా తగ్గిపోయాయి. మనసు విప్పి ఆత్మీయంగా పలకరించుకునే పరిస్థితి లేదు. పండుగలు, శుభకార్యాలని వస్తున్నా ఎవరి బిజీలో వారు ఉంటున్నారు. ఏదైనా కష్టమొస్తే ఆదుకునేవారు కరువయ్యారు. ఎదురుగా ఉన్న మనిషిని పలకరించడం కంటే కనిపించని మనుషులతో సోషల్ మీడియాలో కబుర్లు అధికమయ్యాయి. ప్రస్తుతం ఎవరికి వారు ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతున్నారు. ఇంట్లో పెద్ద లున్నా వారిని వృద్ధాశ్రమాలకు పంపించేస్తున్నారు.

–డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, సీఎస్‌ఆర్‌ఎంవో, జీజీహెచ్, కర్నూలు

మనిషికి డబ్బే ముఖ్యమైంది



ఇప్పుడంతా డబ్బే ప్రధానంగా మారింది. మనిషిలో స్వార్థం పెరిగిపోయింది. ఎదుటి మనిషిని ఎలా దోచుకోవాలన్న ఆలోచన ఎక్కువైంది. సమాజంలో ఎవ్వరినీ నమ్మలేని పరిస్థితి నెలకొంది. ఆనాటి అనుబంధాలు, ఆత్మీయతలు మళ్లీ చూస్తామన్నది కలగా మిగిలిపోతుంది. మానవ విలువలకన్నా మనిషికి డబ్బే ముఖ్యమైపోయింది. ఇందుకోసం ఏమి చేయడానికైనా వెనుకాడటం లేదు. శుభకార్యానికి పిలిస్తే వస్తారు గానీ కష్టమొస్తే పలకరించే దిక్కులేకుండా పోయింది. మళ్లీ పాత రోజులు రావాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నా.

– డాక్టర్ సి. మల్లికార్జున్, సీనియర్ గైనకాలజిస్టు, కర్నూలు

కష్టమొస్తే పలకరించేవారు కరువయ్యారు



ఒకప్పుడు ఎవ్వరికైనా కష్టమొస్తే కుటుంబసభ్యులతో పాటు ఇరుగుపొరుగు వారు కూడా చేయందించేవారు. ఇప్పుడు సన్నిహితులకు కష్టమొస్తే వారి స్నేహితులు, బంధువుల్లో కూడా చాలా మంది పలకరించే సాహసం చేయడం లేదు. ఉన్నత చదువులు, పెద్ద పెద్ద ఉద్యోగాలు వస్తే మాత్రం మనుషులను దూరం చేసుకుంటున్నారు. సన్నిహితులైనా సాయం చేయడానికి ముందుకు రావడం లేదు. అయితే ఇప్పటికీ గ్రామాల్లో, పట్టణాల్లోని మురికివాడల్లో మనుషుల మధ్య అభిమానాలు, ఆత్మీయతలు కనిపిస్తాయి.

– బాలకృష్ణ, రిటైర్డ్ ఉద్యోగి, కర్నూలు

వీఆర్ పంచముఖికి పద్మశ్రీ



వాదీరాజ్ పంచముఖి

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయంలోని గురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం ఉప కులపతి వాదీరాజ్ పంచముఖి పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆయన పద్మశ్రీ అందుకోనున్నారు. వీఆర్ పంచముఖి కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో మధ్వబ్రాహ్మణ వంశంలోని రాఘవేంద్రాచార్య, కమలాబాయి దంపతులకు జన్మించారు. గణితం, ఎకనామిక్స్‌లో మంచి పట్టున్న వీఆర్ పంచముఖి 1956లో కర్ణాటక విశ్వవిద్యాలయంలో మొదటి ర్యాంకు, 1958లో బాంబే యూనివర్సిటీలో మొదటి ర్యాంకు సాధించారు. ఇలా అంచెలంచెలుగా ఎదుగుతూ అసమాన ప్రతిభ చాటుతూ అడుగులు వేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఎన్నో అవార్డులు ఆయన సొంతం చేసుకున్నారు. 2003లో సంస్కృతం భారత రాష్ట్రపతి సర్టిఫికెట్ హానర్, 2008లో వాచస్పతిగా న్యూఢిల్లీ లాల్ బహదూర్ శాస్త్రి విశ్వవిద్యాలయం నుంచి పొందారు. అలాగే విశ్వేశ్వరయ్య ప్రశస్తి, కర్ణాటక రాజోత్సవ అవార్డు 2013లో జీవిటీఎం ఫౌండేషన్ వార్షిక అవార్డు పొందారు. అంతకు మించి వివిధ ప్రొఫెసర్‌గా ఆయన సాధించిన ఘనత ఎంతో గొప్పది. భారతదేశం ఆర్థిక మంత్రిత్వ శాఖ సలహాదారుగా పనిచేయడం విశేషం. ఇండియన్ ఎకనామిక్స్ అసోసియేషన్ జర్నల్ మేనేజింగ్ డైరెక్టర్‌గానూ పనిచేశారు. వీఆర్ పంచముఖి పద్మశ్రీగా గుర్తింపు తెచ్చుకోవడం పట్ల మంత్రాలయం వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

డాక్టర్ నాగేశ్వరరెడ్డి కేఎంసీ పూర్వ విద్యార్థి



కర్నూలు (హాస్పిటల్): పద్మ విభూషణ్‌కు ఎంపికైన ప్రముఖ డాక్టర్ డి.నాగేశ్వర రెడ్డి కర్నూలు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థి కావడం విశేషం. ఆయన 1974వ బ్యాచ్‌లో ఇక్కడ ఎంబీబీఎస్ చదివారు. ఆయన తండ్రి డాక్టర్ భాస్కర్‌రెడ్డి కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం హైదరాబాదులో ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హాస్పిటల్ ద్వారా విశిష్ట వైద్య సేవలు అందిస్తున్నారు. భారత ప్రభుత్వం ఆయనకు పద్మవిభూషణ్ ఇచ్చి సత్కరించడం పట్ల కేఎంసీ ప్రిన్సి పాల్ చిట్టి నరసమ్మ, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ హెచ్‌ఓడీ డాక్టర్ మోహన్‌రెడ్డి, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్‌శర్మ హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఓటుతోనే సాధ్యం





ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య, ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

కర్నూలు(సెంట్రల్): దేశ భవిష్యత్ కోసం యువతీయువకులు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదై ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. జేసీ నవ్య, ఇన్‌చార్జ్ డీఆర్వో బీకే వెంకటేశ్వర్లు, ఎస్‌డీసీ చిరంజీవి, మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ గీతాలను విద్యార్థినులు ఆలపించారు. వేడుకలకు హాజరైన వారికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్‌కుమార్ వీడియో సందేశాన్ని వినిపించి న జేసీ నవ్య ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థిని, విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే సీనియర్ సిటిజన్‌లు, విభిన్న ప్రతిభావంతు ఓటర్లకు శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఉపాధి కల్పన అధికారి దీప్తి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఈరన్న కుటుంబానికి అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడుని హత్య చేయడం దారుణం
- కర్నూలు జిల్లాలో రెడ్‌బుక్ పాలన కొనసాగుతోంది
- హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి



మృతుడు ఈరన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

ఆలూరు రూరల్/ఆలూరు: వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు అనే కక్షతోనే ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను టీడీపీ కార్యకర్తలు అతి దారుణంగా హత్య చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి విమర్శించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కలిసి శనివారం వారు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి నివాళుల ర్పించారు. అరికెర గ్రామమానికి వెళ్లి ఈరన్న కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ఇదెక్కడి పాలనని లోకేష్‌ను ప్రశ్నిస్తున్నానన్నారు. ఈరన్నను హత్య చేశారని, ప్రజలు అధికారాన్ని ఇచ్చింది ఊచకోత కోయడానికి కాదన్నారు. గత నెల రోజుల నుంచి ఈరన్నను ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు వదిలిపెట్టాలని అరికెర గ్రామానికి చెందిన గాది, గోపి, రామదాస్ అనే టీడీపీ కార్యకర్తలు ఇంటికి వెళ్లి బెదిరించారన్నారు. పైగా లక్షలు రూపాయలు డిమాండ్ చేశారన్నారు. అరికెరలో హత్యపై న్యాయపోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వాలు మారుతుంటాయని, పోలీసు అధికారులు చట్టానికి లోబడి పని చేయాలన్నారు. ఈరన్నను హత్య చేసిన నిందితులకు కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మితిమీరిన టీడీపీ నాయకుల ఆగడాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత టీడీపీ నాయకుల ఆగడాలు ఎక్కువయ్యాయని, హత్యా రాజకీయాలకు తెగబడుతున్నారని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పిపోయినా పట్టించుకోకుండా హోంశాఖ మంత్రి అనిత ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఏడు నెలలుగా రాష్ట్రం అంతా రావణకాష్టంగా మారిందన్నారు. అరాచకపాలన ఆగిపోవాలని, హత్యచేసిన వారికి శిక్షపడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

హత్యలే రాజకీయమా?

గత ప్రభుత్వంలో, అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం మూడు పువ్వులు, ఆరు కాయల్లాగా ఉండేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హత్యలు, అత్యాచారాలు ఎక్కువ అయ్యాయన్నారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వకుండా హత్యలకు ఆదేశాలు ఇస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఆరుగురు సంతానం కలిగిన ఈరన్న అనే వ్యక్తిని హత్యచేయించిన వారు నాశనమైపోతారన్నారు. టీడీపీ ఆలూరు ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్, ఆయన తనయుడు గిరి మల్లేష్ గౌడ్ ఆదే శాలతోనే వారి అనుచరులు ఈరన్నను హత్య చేశా రని మండల ప్రజలు చర్చించుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే విరూపాక్షి సమక్షంలో బాధిత కుటుంబాన్ని తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వద్దకు తీసుకెళ్లి భరోసా కల్పిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళాకృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి ఈరన్న, ఉపాధ్యాక్షుడు గిరి, నియోజకవర్గం నాయకులు కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతి ఆత్మహత్య

డోన్ రూరల్ : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన వట్టి వల్ల రజిత(20) అనే యువతి శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. డోన్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మన్న, లక్ష్మీదేవి దంపతులకు ముగ్గురు కూతుర్లు, ఇద్దరు కుమారులు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లి కావడంతో మూడో కుమార్తె రజితకు పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని ఆ యువతి శనివారం పొలానికి వెళ్లి అక్కడ వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అటు వైపు వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే వారు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ.మమత ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి లక్ష్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పాము కాటుతో గొర్రెల కాపరి మృతి


ఓర్వకల్లు: పాము కాటుతో గొర్రెల కాపరి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కుర్వ చిన్న స్వాములు (53) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం గ్రామం వెలుపల ఉన్న గొర్రెల మందకు మేత వేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో వెంటనే స్పృహతప్పి కిందపడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఓ యువకుడిపై ఇద్దరు మద్యం మత్తులో కత్తితో దాడి చేశారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అవుట్‌పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. పట్టణంలోని విశ్వనగర్ వీధికి చెందిన విజయ్‌కుమార్ తన బావమరిది శేఖర్ రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్తున్నారు. స్థానిక శ్రీరామ థియేటర్ సమీపంలో రమేష్ ఎదురుపడ్డాడు. ఇతను విజయ్‌కుమార్ వద్ద బైక్‌ను కుదువ పెట్టి అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించే విషయంలో ఇరువురు గొడవపడ్డారు. ఈక్రమంలో శనివారం రమేష్ ఎదురుపడగానే మద్యం మత్తులో ఉన్న విజయ్‌కుమార్, శేఖర్‌లు కత్తితో దాడి చేశారు. బాధితుడికి స్వల్ప గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గణతంత్రం.. స్వేచ్ఛా జీవనం

- నేడు గణతంత్ర దినోత్సవం



కర్నూలు కల్చరల్: బ్రిటీష్ పాలనాకాలంలో ప్రజల స్వేచ్ఛను హరించేవారు. ఎవరైనా ఎదురుతిరిగితే కఠిన శిక్షలు అమలు చేసేవారు. తెల్లదొరల దాస్య శృంఖలాల నుంచి భారతావనిని కాపాడేందుకు ఎందరో మహనీయులు ప్రాణాలు అర్పించారు. వారి త్యాగ ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. రాజ్యాంగం కల్పించిన హక్కులతో స్వేచ్ఛగా.. అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్నాం. స్వాతంత్ర్య సమరంలో ఉమ్మడి కర్నూలు జిల్లా వీరులు కదంతొక్కారు. వందే మాతరం అంటూ గర్జిస్తూ తెల్ల దొరలను గజగజ వణికించారు. గులాం రసూల్‌ఖాన్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ముత్తుకూరు గౌడప్ప, బియాబాని, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వనం శంకర శర్మ, నివర్తి వెంకట సుబ్బయ్య, టి. చిదంబరం, ఆర్‌కే రామ్, గామాగో, చిదంబరం, మేడం వెంకయ్య శెట్టి, ఖాదర్‌బాద్ నరసింగరావు.. స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను అర్పించారు. గాడిచర్ల సంపాదకత్వంలో విజయభేరి, ప్రేమ, తుంగభద్ర, దక్కన్ వైశ్య, మాణిక్య ప్రభ, ఉపాధ్యాయ, భద్రవాణి లాంటి పత్రికలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెలువడుతూ ప్రజలను చైతన్య వంతులను చేశాయి. శంకరనారాయణ భజన మందిరం, హిందూ, మహమ్మదీయ సంఘం, యూనియన్ క్లబ్, దేశాభిమాని సభ లాంటి సంస్థలు ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష పెరగడానికి, ఉద్యమం వైపు అడుగులు వేయడానికి ఎంతగానో కృషి చేశాయి. స్వాతంత్ర్యం సిద్ధించడంలో కీలకపాత్ర పోషించాయి.

➡ కర్నూలు కొండారెడ్డి బురుజు వెనక వీధిలో నివసించిన సర్దార్ నాగప్ప, అమరావత్మ దంపతులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. జైలు జీవితం గడిపిన వీరు వందే మాతర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. భారత దేశానికి లిఖిత రాజ్యాంగం ఏర్పడేదాక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి వైస్రాయి భారతీయులను ఆహ్వానించారు. నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. 1946లో భారత రాజ్యాంగ చట్టాన్ని తయారు చేయడాని రాజ్యాంగ సభకు ఎన్నికలు జరిగాయి. కర్నూలు నగరానికి చెందిన సర్దార్ నాగప్ప దీనికి ఎన్నికయ్యారు. సర్దార్ నాగప్ప నివసించిన వీధికి ఆయన పేరు పెట్టారు.

➡ జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో 1942న క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. ఆ సమయంలో కర్నూలు సర్క్యులర్ రూపొందించారు. ఆంధ్ర దేశమంతటా ప్రజలు టెలిఫోన్ తీగలను తెంపివేయాలని, రైలు పట్టాలను తొలగించి వేయాలని, కార్మికులు సమ్మెకు పిలుపునివ్వాలని, రైల్లో టికెట్ లేకుండా ప్రయాణాలు చేయాలని, ప్రభుత్వానికి ఎటువంటి పన్నులు చెల్లించ కూడదని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఇది రాష్ట్రమంతటా సంచలనం రేపింది.



➡ క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో కర్నూలులోని రాణి తోట మైదానంలో జాతీయ జెండా ఎగురవేసి వందేమాతరం గీతాన్ని ఆలపించాలని తలంచారు. అయితే అప్పటి ప్రభుత్వ నిర్బంధంతో ఎవరూ సాహసించ లేకపోయారు. అటువంటి సమయంలో తిప్పారెడ్డి అనే దేశభక్తుడు కొందరు పిల్లలను తోడుగా తీసుకెళ్లి ధైర్యంగా జెండా ఎగురవేశారు.

➡ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నందుకు టీజీఎల్ తిమ్మయ్య శ్రేష్ఠి అల్లీపురం క్యాంప్ కారాగారంలో 1942 సెప్టెంబర్ 7 నుంచి ఆరు నెలల పాటు కఠిన శిక్షను అనుభవించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

జిల్లాలో ప్రప్రథమం..

- 1857లో జిల్లాలో మొదటి సారిగా ముత్యాలపాడు గ్రామంలో బాలికల కోసం ప్రత్యేక పాఠశాల ప్రారంభించారు.
- **జిల్లాలో తొలి విద్యా సంస్థ:** నంద్యాలలో బాలుర బోర్డింగ్ హైస్కూల్(1855).
- **తొలి రైలు బిడ్జి:** తుంగభద్రానదిపై మంత్రాలయం వద్ద నిర్మించారు.
- **కర్నూలు తొలి పార్లమెంట్ సభ్యులు:** శేషగిరి రావు (ఇండిపెండెంట్–1928)
- **మొట్టమొదట విద్యుత్తు వెలుగు వచ్చింది:** కర్నూలు పట్టణం:1928
- **జిల్లా నుంచి వెలువడిన తొలి పత్రిక:** అరుణోదయం పక్ష పత్రిక
- **జిల్లా సహకార సంఘాల వ్యవస్థాపకులు:** మాచాని సోమప్ప (ఎమ్మిగనూర్ వీకర్స్ ఆపరేటివ్ సొసైటీ–1938)
- **తొలి పశుక్షేత్రం:** బనవాసి(1928)
- జిల్లాలో మొదటి సారిగా గుర్తింపు పొంది రిజిస్టర్ అయిన గ్రంథాలయం పత్తికొండ రీడింగ్ రూం. ఇది 1920లో రిజిస్టర్ అయింది.

విజయం సాధించారు



దేశంలో 1952 వరకు కలెక్టర్లే జాతీయ పతాకాన్ని ఎగురవేసేవారు. ఆ తరువాత స్వాతంత్ర్యం దినోత్సవం రోజున మంత్రులు, గణతంత్ర్య దినోత్సవం రోజున కలెక్టర్లు జాతీయ పతాకాన్ని ఎగరవేస్తున్నారు. జిల్లాలో కలెక్టర్ మాధవరావు తొలిసారి జెండాను ఎగుర వేశారు. అప్పట్లో నాయకంటి శకంర్‌రెడ్డి, సర్దార్ నాగప్పలు ప్రజాప్రతినిధులు గా ఉన్నారు. సర్దార్ నాగప్ప రాజ్యాంగ సభ, ప్రొవిజినల్ పార్లమెంట్‌లో సభ్యుడుగా ఉన్నారు. హాలహర్వి సీతారామిరెడ్డి, కందుల ఓబుల్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. దోర్నాల వెంకటరత్నం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. బీవీ సుబ్బారెడ్డి జిల్లా బోర్డు ప్రెసిండెంట్‌గా ఉన్నారు. పెండేకంటి వెంకటసుబ్బయ్య, పాణ్యం నరసరామయ్యలు బనగానపల్లె సంస్థానం విలీనానికి పోరాటం చేసి విజయం సాధించారు. **– చంద్రశేఖర కల్కూర, అధ్యక్షులు, గాడిచర్ల ఫౌండేషన్**

నిజమైన గణతంత్రం



ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను జరుపుకుంటున్నాం. స్వాతంత్ర్య దినోత్సవం గొప్పతనం గురించి చెప్పుకుంటున్నాం. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన వారి ఊపిరిని మనం మన శ్వాసగా భావిస్తే అప్పుడు నిజమైన గణతంత్రం వచ్చినట్లు. మన జాతీయ జెండా రెపరెపలలో అమర వీరుల రూపాలను మనో నేత్రంతో చూసినప్పుడు కలిగే స్పందనే నిజమైన దేశభక్తి. ఈ జెండాకు సలాం చేస్తున్నామంటే ఆనాటి ఆ నాయకులకు సాష్టాంగ నమస్కారం చేసినట్లే.
– డాక్టర్ హరికిషన్, కథా రచయిత, పరిశోధకులు

రచ్చమర్రిలో భారీ చోరీ

- కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లగా చొరబడిన దుండగులు
- ఇంట్లో 70 తులాల బంగారు, రూ.10 లక్షలు చోరీ

మంత్రాలయం: మండలంలోని రచ్చమర్రి గ్రామంలో దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. ఇంటికి తాళం వేసి దేవుడి దర్శనానికి వెళ్లగా చొరబడి అందినకాడికి దోచుకెళ్లారు. వివరాలివి.. రచ్చమర్రి గ్రామానికి చెందిన శేషాద్రిశెట్టి కుటుంబ సభ్యులు గత శనివారం తీర్థయాత్రలకు వెళ్లారు. ఇదే అదునుగా చూసుకున్న దొంగలు మెయిన్ గేటు తాళాలు తీయకుండా కాంపౌండ్‌లోకి దూకి తలుపుల స్క్రూలు తీసేసి లోపలికి దూరారు. బీరువాను పగలగొట్టి అందులోని బంగారు, నగదు ఎత్తుకెళ్లారు. శేషాద్రి కుటుంబ సభ్యులు శుక్రవారం వేకువ జామున ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. చోరీ జరిగిందని నిర్ధారించుకుని మాధవరం పోలీసులకు సమాచారం చేరవేశారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని ఆరా తీశారు. కర్నూలు నుంచి క్లూస్ టీమ్ వచ్చి నమూనాలు సేకరించారు. బాధితుడి తెలిపిన వివరాల మేరకు తమ ఇంట్లో 70 తులాల బంగారు, కేజీ వెండి, రూ.3.50 లక్షలు చోరీకి గురైనట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో నగలు, నగదు చోరీకీ గురికావడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.



ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న మాధవరం ఎస్‌ఐ విజయ్‌కుమార్

మహానందిలో లోకాయుక్త అధికారుల విచారణ

మహానంది: మహానంది దేవస్థానంలో వివిధ అంశాలపై లోకాయుక్త అధికారులు శనివారం విచారణ చేపట్టారు. మహానందిలో పురాతన కాలం నాటి నిశ్చితార్థ మండపాన్ని తొలగించి ఆ స్థానంలో నూతన మండప నిర్మాణానికి గత ఏడాది ఫిబ్రవరిలో కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో భూమి పూజ చేయించారు. అయితే, వంశపారపర్యంగా మహానందీశ్వరుడి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న గుండుపాపల, గుండంపాడు గ్రామాలకు చెందిన కల్యాణోత్సవ దాతలు, పెళ్లిపెద్దలే నిర్మాణం కోసం ముందుకు వచ్చారు. కానీ పలు కారణాల వల్ల నిశ్చితార్థ మండప నిర్మాణం వాయిదా పడుతూ వస్తుంది. దీనిపై ఇటీవల పత్రికల్లో కథనాలు రావడం, కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో అధికారులు నిశ్చితార్థ మండపం కూలగొట్టడంపై ఆరాతీయడంతో పాటు భూములు, దసరా నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, విద్యుద్దీపాలంకరణ బిల్లులు, ఉద్యోగుల జీతభత్యాలు తదితర వాటి గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు.



నిశ్చితార్థ మండప పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పీఠాధిపతి (ఫైల్)

శరీర దానానికి ముందుకొచ్చిన దంపతులు



శరీర దానానికి అంగీకరిస్తూ పత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మకు ఇస్తున్న దంపతులు

కర్నూలు(హాస్పిటల్): తమ మరణానంతరం శరీరాలను మెడికల్ కాలేజీకి అప్పగించేందుకు బనగానపల్లెకి చెందిన దంపతులు ముందుకు వచ్చారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం యనగండ్ల గ్రామానికి చెందిన దినేష్, శకుంతలలు వారి మరణానంతరం పార్థీవ శరీరాలను వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం కర్నూలు మెడికల్ కాలేజీ వారు ఉపయోగించుకోవచ్చని తెలుపుతూ శనివారం అంగీకార పత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా శరీర దానానికి ముందుకు రావడం అన్నది గొప్ప విషయమని అభినందించారు. వారి కుటుంబసభ్యుల అంగీకారంతోనే ఆ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఇది వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు.

జాతీయ క్రీడలకు ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు



రామాంజనేయులు

కర్నూలు (టౌన్): ఈనెల 28 నుండి వారం రోజుల పాటు డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న జాతీయ పోటీలకు పరిశీలకులుగా ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం జాతీయ క్రీడల నిర్వాహకుల నుంచి లేఖ అందుకున్నారు. జాతీయ క్రీడల ప్రారంభోత్సవం నుంచి వివిధ క్రీడాంశాల్లో జరిగే పోటీలను ఆయన పరిశీలించనున్నారు. జాతీయ క్రీడలకు పరిశీలకులుగా ఎంపికయినందున జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అయ్యో 'పాప'ం

అమ్మా.. నాకోసం ఎంత కష్టపడ్డావు
తొమ్మిది నెలలు నన్ను నీ కడుపులో పెంచావు
మంచి ఆహారాన్ని తీసుకున్నావు
నన్ను చాలా జాగ్రత్తగా చూసుకున్నావు
ఏమైందో ఏమో.. అమ్మా..
నా పుట్టుక ఇష్టంలేక.. నన్ను వదిలేశావు..
నాన్నా.. నేనంటే నీకు ఇష్టమే లేదా?
అమ్మ ఒడిలో ఉండాలని...
నాన్న మాటలు వినాలని ఉంది..
అంతా నా 'విధి'రాత..
అందమైన ఈ లోకంలో నాకు చోటులేకుండా
మృత్యువు నన్ను కబళించింది..
నా ఆశలు తుంచేసింది!!



కోవెలకుంట్ల పట్టణం వడ్డెవీధిలోని డ్రెయినేజీలో శనివారం ఓ ఆడశిశువు మృతదేహం కనిపించింది. ఆ పాప రోదనే పై విధంగా ఉండవచ్చు అనే మాటలు వినిపించాయి. జాతీయ బాలికా దినోత్సవం రోజున అప్పుడే పుట్టిన పసికందును కాల్వలో విసిరేసి ఆయుష్షు తీయడం అందరినీ కలచివేసింది. ఆడపిల్లను బతకనిద్దాం అంటూ అధికారులు పెద్ద ఎత్తున బాలికా దినోత్సవాన్ని నిర్వహించిన కొన్ని గంటలకే ఈ ఘటన చోటు చేసుకోవడం విచారకరం. కాల్వలోని శిశువు మృతదేహాన్ని శునకం వెలికి తీయడాన్ని కాలనీ వాసులు గుర్తించగా.. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ అక్కడికి చేరుకుని వివరాలను ఆరా తీశారు. వేరే ప్రాంతానికి చెందిన మహిళ శిశువును తీసుకొచ్చి రాత్రి వేళ ఇక్కడ కాల్వలో పడేసినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం శిశువుకు అంత్యక్రియలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు శిశువును కాల్వలో వేసినట్లు వీఆర్వో ఆదినారాయణ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. **– కోవెలకుంట్ల**

ఆటోలు ఢీ .. విద్యార్థిని మృతి

మంత్రాలయం: మండల పరిధిలోని సోళ్లహాళ్లి గ్రామ శివారులో రెండు ఆటోలు ఢీకొని విద్యార్థిని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుంకేశ్వరి గ్రామానికి చెందిన ఆంజినేయ్య, ఈరమ్మ కుమార్తె అనూష విద్యానగర్ తండాలోని ఎస్‌ఎంకేవీ పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. ప్రతి రోజులాగే పాఠశాలకు వెళ్లే క్రమంలో ఆటోలో ప్రయాణిస్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న మరో ఆటో ఢీకొట్టడంతో అనుష తీవ్రంగా గాయపడగా అదే ఆటోలో ప్రయాణిస్తున్న ఈడిగ మూర్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రైవేటు ఆటోలో అనూషను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు మాధవరం పోలీసులు తెలిపారు.



అనూష (ఫైల్)

సాక్షి ఫ్యామిలీ
కర్నూలు
ఆదివారం ॥ 26-1-2025

గెలిచిన దారులు మిగిలిన ఆకాంక్షలు

● నేడు గణతంత్ర దినోత్సవం

రాజ్యాంగం... దేశ పాలనావ్యవస్థకు పరమగ్రంథం. ప్రతి పౌరునికి శిరోధార్యం. బలహీనులకు వజ్రాయుధం. బలవంతులను అదుపు చేసే అంకుశం. పురుషస్వామ్య పెత్తందారీ నుంచి స్త్రీలు అడుగు ముందుకు వేయడానికి రాజ్యాంగం పరిచిన దారులు వారిని నేడు ఆత్మగౌరవంతో నిలబెట్టి స్వయం సమృద్ధి వైపు నడిపిస్తున్నాయి. సాధించింది ఎంతో. సాధించాల్సింది మరెంతో. ఆకాంక్షలను అలాగే నిలబెట్టుకుంటూ ముందుకు సాగాలని అంటున్నారు సీనియర్ రచయిత్రి.



భారత రాజ్యాంగాన్ని స్త్రీల దృష్టితో చూడటానికి ఈరోజొక వజ్రోత్సవ సందర్భం. వాలుకి కొట్టుకు పోయే యాంత్రికత నుంచి బైటకి వచ్చి, దాటి వచ్చిన కాలాలను, నడుస్తున్న సమయాలను నిమ్మళంగా చూస్తున్నప్పుడు కొంత సంతోషం, మరి కొంత బాధ. ఈ రోజుల్లో భర్త చనిపోతే భార్య చితిలోకి దూకనవసరం లేదు, అతి బాల్య వివాహాలు చేసుకోనవసరం లేదు, వితంతువులు రహస్య గర్భ విచ్ఛిత్తిలో ప్రాణాలు పోగొట్టుకోనవసరం లేదు. గడపచాటున నిలబడి మాట్లాడటం, ముట్టుగదుల్లో మగ్గడం, అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాల నుంచి స్త్రీలు చాలావరకూ బైటపడ్డారు. రాజ్యాంగంలో స్త్రీలకి సమానహక్కులు పొందుపరచడానికి ముందుతరాల వారు చేసిన సంఘసంస్కరణ చాలావరకూ మూలకారణం. దీనికి సమానమైన చేర్పుని రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ ఆలోచనలు ఇచ్చాయి.



స్త్రీలని వాహికలుగా చేసుకుని కులం, మతం వ్యాప్తి చెందుతాయని, ఈ సమాజాన్ని కొందరి చెప్పు చేతుల్లోనే ఉంచుతాయన్నది అంబేద్కర్ అవగాహన. అందుకే దళిత, కార్మికవర్గాల కోసం ఆలోచించినంతగా స్త్రీ సమానత్వం కోసం కూడా పాటుబడ్డారు. రాజ్యాంగానికి మూలాధారమైన 'అందరికీ సమానమైన విలువ' అనే అంబేద్కర్ ప్రతిపాదన పైకి కనిపించే సాధారణ విషయం కాదు. ఆ కాలానికే కాదు, ఇప్పటికీ మనుషులు సమానంగా లేరు. స్త్రీలు చాలా విషయాల్లో రెండవ తరగతి పౌరులుగానే ఉన్నారు. ఆ స్థితిని పోగొట్టి, స్త్రీల జీవితాల్లో విప్లవాత్మక మార్పుల కోసం అంబేద్కర్ ప్రవేశపెట్టిన 'హిందూ కోడ్ బిల్' ఒక సంచలనం. అంతవరకూ స్త్రీలకి సామాజిక, రాజకీయ, కుటుంబహక్కుల వంటివి లేవు. సమానత్వ ప్రాతిపదిక మీద రాజ్యాంగం ద్వారా వారు ఆ హక్కులను మిగతా వారితో పాటు సహజంగానే పొందారు. ఉదాహరణకి రాజ్యాంగ ఏర్పాటుకి మునుపు సార్వత్రిక ఓటుహక్కు లేదు. తొంభైశాతం పైగా స్త్రీలకి ఓటువేయడం అంటే ఏమిటో తెలీదు. కానీ రాజ్యాంగం ద్వారా స్త్రీలంతా ఓటు వేయడమే కాదు, రాజకీయ పార్టీలలో చేరి, ఎన్నికలలో పాల్గొని, శాసనసభలకి చేరారు.

'బిఏ చదివినా బియ్యంలో రాళ్లేరక తప్పుతుందా' అన్నవారికి- ఉద్యోగాలు చేసి, ఊళ్ళేలి చూపించారు స్త్రీలు. బ్రిటిష్ పాలనకి భిన్నంగా భారత రాజ్యాంగం స్త్రీల ఉనికిని నిరూపించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను వాడుకుని చేసిన అనేక పోరాటాల ఫలితంగా స్త్రీలకి అనుకూలమైన కొన్ని చట్టాలు రూపొందాయి. వివాహానికి సరైన వయసు ప్రాతిపదిక అయింది. అబార్షన్ హక్కులు ఉన్నాయి. విడాకులు పూర్వమంత కఠినం కావు. స్త్రీలపై సాగే గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలకి కఠినశిక్షలు ఉన్నాయి. ఆస్తి, వారసత్వ హక్కుల విషయంలో కూడా ప్రగతి కనబడుతోంది. ముఖ్యంగా స్త్రీల సామాజిక, రాజకీయ భాగస్వామ్యం మెరుగుబడింది.

అయితే, స్త్రీల హక్కులన్నిటికీ కాపాడగల రక్షణ వ్యవస్థలు నిష్పక్షపాతంగా లేవు. అవి మగ స్వభావాన్ని, మగ పెత్తనాన్ని తెలియక, తెలిసి ప్రదర్శిస్తాయి. దానివల్ల మొగ్గు పురుషుడి వైపు ఉండి స్త్రీ సమానత్వాన్ని సూచించే రాజ్యాంగస్ఫూర్తిని భగ్నం చేస్తాయి. అందుకే 'అందరికీ ఒకే విలువ' సూత్రం ఆచరణలో విఫలం అయింది. స్త్రీలు అన్ని ఉద్యోగాలకి అర్హులు. కానీ సైనికులుగా, భారీ వాహన చోదకులుగా, పెద్దపెద్ద హోదాలు కల ఉద్యోగులుగా, మంత్రులుగా, వ్యాపారవేత్తలుగా వారి ఉనికి ఎంత? ఇటీవలి అంచనాలు కార్మిక వర్గంలో, 'బాస్' స్థానాలలో స్త్రీల నిష్పత్తి పతనమవుతున్నదని హెచ్చరిస్తున్నాయి. ఇక కొన్ని ప్రత్యేక రంగాల్లో స్త్రీలు అడుగు పెట్టాల్సే ఉంది.

సంసిద్ధత లేకపోవడం సమాజానికే కాదు, సమాజం తయారు చేసే స్త్రీలది కూడా కావొచ్చు. అందరినీ ఒక చోటికి చేర్చాలంటే వెనుకబడి ఉన్న వారిని ముందుకు చేర్చడానికి రిజర్వేషన్లు కావాలి. విద్యా ఉద్యోగ రంగాలలో స్త్రీలకి 33 శాతం రిజర్వేషన్లని అంగీకరించిన రాజ్యాంగం- చట్టసభలకి ఆ హక్కుని వర్తింపజేయలేక పోయింది. 33 శాతం రిజర్వుడ్ స్థానాల్లోనూ, జనరల్ స్థానాల్లో మరి కొందరు స్త్రీలు కలిసి చట్టసభలకి చేరి విధాన నిర్ణయాలు చేయడమన్న ఆలోచనకే రాజకీయపార్టీలు వ్యతిరేకం కనుకనే ఇంతవరకూ మహిళా రిజర్వేషన్ల బిల్లు ముందుకు పోవడం లేదు. స్త్రీల శరీరాల మీద పురుషులకి ఉండే హక్కులకి, స్త్రీల గౌరవానికి భంగకరంగా ఉన్న అడల్టరీ చట్టం ఎత్తి వేయడానికి రాజ్యాంగం ఏర్పడ్డాక కూడా దాదాపు ఏడు దశాబ్దాలు పట్టింది. తల్లికి బిడ్డల మీద ఉండాల్సిన సహజ బాధ్యతలు, హక్కుల విషయంలో కూడా చాలా వివక్ష ఇప్పటికీ ఉంది. పురుషుని ఇంటిపేరుతో స్త్రీ, ఆమె పిల్లలు గుర్తింపు పొందడం- పితృస్వామ్యం బలంగా ఉండడాన్నే సూచిస్తుంది.

రాజ్యాంగంలో కూడా స్త్రీలహక్కులకి సంబంధించి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఆచరణలో చాలా లోటుపాట్లు కూడా ఉన్నాయి. అయినాసరే స్త్రీలు తాము పోరాడి సాధించుకున్న చైతన్యాన్ని నిలుపుకోవడానికి తమ హక్కులకి రక్షణ ఉండాలని గట్టిగా అడగడానికి రాజ్యాంగమే ఆసరాగా ఉంది. దానికి తోడు మహిళాపోరాటాల సాధించుకున్న, సాధించుకోబోయే మార్పులు- 'అందరికీ ఒకే విలువ' సూత్రానికి స్త్రీలని మరింత దగ్గర చేస్తాయని నమ్మిక. ఈ నమ్మకాన్ని సడలనివ్వకుండా మనం ముందుకు సాగాలి.

- కె.ఎన్.మల్లీశ్వరి, రచయిత

సర్వ ఆహార సమ్మేళనం

"సన్నగా ఉండాలని కడుపు మాడ్చుకుంటే అనారోగ్యమే. చక్కగా తినాలి... చక్కగా ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. ఆరోగ్యమే మహాభాగ్యం" అని **ఉష మూల్పూరి** అన్నారు. నిర్మాతగా తన తనయుడు నాగశౌర్యతో 'ఛలో', నర్తనశాల, కృష్ణా వ్రింద విహారి' తదితర చిత్రాలను నిర్మించారు. తొలి చిత్రం 'ఛలో' తోనే నిర్మాతగా సక్సెస్‌ని టేస్ట్ చేసిన ఉష ఇప్పుడు తన రెస్టారెంట్ 'ఉష మూల్పూరి'స్ కిచెన్' ద్వారా రుచికరమైన వంటకాలు అందిస్తున్నారు. ఇక గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'సాక్షి' కోసం ప్రత్యేకంగా కొన్ని వంటకాలు తయారు చేశారు. ఆ వంటకాలు తెలుసుకుందాం.



ఉష మూల్పూరి

"దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్... ఆ మనుషుల ఆరోగ్యం మా బాధ్యత... అందుకే రిపబ్లిక్ డే సందర్భంగా చేసిన వంటకాల్లోనూ పోషక విలువలు ఉండేలా చూసుకున్నాను" అంటూ దేశభక్తిని చాటుతూ, జెండా రంగులకు తగ్గట్టుగా తాను కూడా రెడీ అయి, కిచెన్‌లోకి ఎంటర య్యారు ఉష. ముందుగా నాన్ వెజ్ స్టార్టర్ చేశారు.. 'పండుమిర్చి కోడి వేపుడు, క్రీమ్ చికెన్, కరివేపాకు కోడి వేపుడు' చేసి, ఆ కాంబోని అందంగా ప్రెజెంట్ చేశారు. "పండు మిర్చిలో విటమిన్ ఎ, బి, సి వంటివి పుష్కలంగా ఉంటాయి. అలాగే క్యాన్సర్‌తో పోరాడే ఔషధ గుణాలు ఉంటాయి. కరివేపాకులో విటమిన్ ఎ, బి, సి, ఇ వంటివి ఉంటాయి. కంటికి, జుట్టుకి మంచిది. ఎముకల ఆరోగ్యానికి కూడా కరివేపాకు బెస్ట్. అందుకే ఆహారం ఆరంభమే ఆరోగ్యంగా ఆరంభించాలని ఈ స్టార్టర్స్ చేశాను" అని వివరించారు ఉష. రైస్ ఐటమ్స్‌లో పుదీనా మాంసం పులావ్, చికెన్ ఫ్రైడ్ రైస్, పండు మిర్చి కోడి పులావ్ చేశారు. "పుదీనాకి మంచి వాసన ఉంటుంది. దాంతో పాటు రుచి కూడా బాగుంటుంది. అలాగే ఆహారం జీర్ణం కావడానికి పుదీనా మంచిది. ఐరన్ పుష్కలంగా ఉన్న పుదీనాని మీరు రోజూ తీసుకోవచ్చు. మనలో చాలామందికి రోజూ టీ తాగే అలవాటు ఉంటుంది. ఆ టీలో కొన్ని పుదీనా ఆకులు వేసుకుని, తాగి చూడండి. మీకే తేడా తెలుస్తుంది. ఇక నాన్‌వెజ్ తినేవారికి చికెన్‌లో ఎన్ని పోషక పదార్థాలు ఉన్నాయో తెలిసిందే" అని పేర్కొన్నారామె. మాంసాహారం మాత్రమే కాదు... శాకాహారం కూడా చేశారు ఉష. వెజ్‌లో కరివేపాకు వెజ్ పులావ్, పండుమిర్చి పనీర్ పలావ్, కర్డ్ రైస్ చేశారు. "కరివేపాకు, పండుమిర్చి ఎంత మంచిదో ముందే చెప్పాను. పనీర్ మంచి ప్రొటీన్ ఫుడ్. నాన్‌వెజ్ తినేవారికి మాంసం రూపంలో ప్రొటీన్లు అందుతాయి. వెజిటేరియన్స్‌కి పనీర్ బెస్ట్. పనీర్‌లో తక్కువ కార్బోహైడ్రేట్స్... ఎక్కువ ప్రొటీన్ ఉంటుంది. ఇక మన ఇండియన్స్‌లో చాలా మందికి ఫైనల్‌గా పెరుగన్నం తింటేనే సంతృప్తిగా ఉంటుంది.





పెరుగులో కావాల్సినంత కాల్షియం ఉంటుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పొట్ట చల్లగా ఉండటానికి పెరుగన్నం కూడా చేశాను" అని తెలిపారు ఉష మూల్పూరి.

ఎనిమిది పదుల వయసులవాళ్లకూ...

"మనం ఆహారం తీసుకున్నాక పొట్ట బరువుగా ఉండకూడదు. తేలికగా అనిపించాలి. ఫుడ్ బిజినెస్ ఆరంభించాలనుకున్నప్పుడు నా మెయిన్ టార్గెట్ ఇదే. మా రెస్టారెంట్‌కి ఎనభై ఏళ్ల వయసు, ఆ పైన ఉన్నవాళ్లు కూడా వస్తారు. 'పొట్ట చాలా తేలికగా ఉందమ్మా' అని వారు చెప్పినప్పుడు హ్యాపీగా ఉంటుంది" అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు.

సెలబ్రిటీలకూ...

"మా కిచెన్ వంటకాలను ఎన్టీఆర్, రామ్ చరణ్, ఉపాసన, కృష్ణారెడ్డి, హరీష్ శంకర్, బాబీ, బుచ్చిబాబు, కోటి, మెగా కృష్ణారెడ్డి, నందినీ రెడ్డిగార్లు వంటివారు ఇష్టపడతారు. మా దగ్గర బ్రోకోలీ కాషూనట్ చిల్లీ గార్లిక్ ఫేమస్. ఇవి ఎక్కువగా తెప్పించుకుంటారు" అని చెప్పారు ఉష.

అవగాహన పెంచుకోవాలి

"నేను రెస్టారెంట్ పెట్టాలనుకున్నప్పుడు నాకు పెద్దగా ఏమీ తెలియదు. జీతాలిచ్చి మనుషులను పెట్టుకుని, వాళ్లతో చేయించేయొచ్చు. కానీ అందులో పరిపూర్ణత ఉండదు. వంటకు కావల్సినవి కొనడం నుంచి వాటిని సరిగ్గా శుభ్రం చేసి వండటం వరకూ అన్నింటినీ దగ్గరుండి చేయించేదాన్ని. 'సర్వమత సమ్మేళనం' అంటారు... 'సర్వ ఆహారం సమ్మేళనం' అంటాను. రెస్టారెంట్ అంటే రకరకాల వాళ్లు వస్తారు. వాళ్లకి తగ్గట్టుగా ఉండాలి కదా. నా కుటుంబ సభ్యులకు వండుతున్నట్లుగా భావించి వంట చేయిస్తాను. వీలున్నప్పుడల్లా అన్ని టేబుల్స్ దగ్గరికి వెళ్లి, అందర్నీ పలకరిస్తుంటాను. 'మాకు ఇంటికి వచ్చినట్టుగా ఉంది' అని అంటుంటారు. అందరికీ 'సాక్షి' ద్వారా థ్యాంక్స్ చెబుతున్నాను" అంటూ ముగించారు ఉష.

– డి.జి. భవాని

హెల్త్

● టీన్- అనీమియా

ఆ టైమ్ లోనూ ఐరన్ యువతిలా...



భారతదేశంలోని మహిళల్లో రక్తహీనత (అనీమియా) చాలా ఎక్కువ. కొన్నేళ్ల కిందట దాదాపు 85 శాతం మంది మహిళలు అనిమిక్‌గా ఉండేవారు. క్రమంగా మహిళల్లోనూ చైతన్యం పెరుగుతుండటంతో ఇటీవల అది 57 శాతానికి చేరింది. ఇంతగా చైతన్యం పెరిగాక కూడా దేశంలోని సగానికి పైగా మహిళలు అనీమియాతో బాధపడుతున్నారు. ఇక ఇటీవలే పీరియడ్స్ మొదలైన టీనేజీ అమ్మాయిల్లో రక్తహీనతతో బాధపడుతుండేవారు ఇంకా ఎక్కువ. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2019–21 ప్రకారం 15 నుంచి 19 ఏళ్ల వయసుండే కౌమార బాలికల్లో అనీమియాతో బాధపడేవారు 59.1 శాతం! రుతుస్రావంలో రక్తం కోల్పోతుండటం, అది భర్తీ అవుతుండగానే నెలసరితో రక్తం కోల్పోతుండటంతో యువతుల్లో రక్తహీనత కనిపిస్తోంది.

కొత్తగా పీరియడ్స్ మొదలైన టీనేజ్ అమ్మాయిలు అనీమియాకు లోనుకాకుండా ఉండాలంటే ఆహారంలో ఐరన్ ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకుంటూ ఉండాలి. అవేమితో చూద్దాం.

ఆహారంలో ఎక్కువగా తీసుకోవాల్సినవి...

● శాకాహారులు తమ ఆహారంలో తాజాగా ఉండే ఆకుకూరలు, ఎండు ఖర్జూరం, నువ్వులు, బెల్లం (బెల్లం, నువ్వులు ఉండే నువ్వుల జీడీలు, బెల్లం, వేయించిన వేరుశనగలు ఉండే పల్లీపట్టీలు తీసుకోవడం మేలు), గసగసాలు, అటుకులు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ● ఒకవేళ మాంసాహారులైతే ఆహారంలో వేటమాంసం, చేపలు, చికెన్‌తో పాటు... మటన్, చికెన్ లివర్‌ను ప్రత్యేకంగా తీసుకోవడం మంచిది. ● మాంసాహారం, శాకాహారం ఈ రెండింటిలోనూ ఐరన్ ఉంటుంది. అయితే మాంసాహారంలో హీమ్ ఐరన్ ఉంటుంది. హీమ్ ఐరన్ అంటే... తిన్న వెంటనే అది ఒంటికి పట్టే రూపంలో ఉంటుంది. అదే శాకాహార పదార్థాల్లో ఉండే నాన్‌హీమ్ ఐరన్ ఒంటికి పట్టేలా చేయడానికి విటమిన్–సి కావాలి. కాబట్టి శాకాహారులు తమ ఆహారాల్లో ఐరన్ ఉండేవి తినేటప్పుడు వాటితో పాటు విటమిన్–సి ఉండే తాజా పండ్లైన జామ, నిమ్మ, నారింజ వంటివి ఎక్కువగా తీసుకోవాలి లేదా వంటకాల్లో విటమిన్–సీ ఎక్కువగా ఉండే ఉసిరి వంటివి తీసుకుంటూ ఉండాలి. ● మాంసాహారులైనా, శాకాహారులైనా కోడిగుడ్డు, పాలు తప్పనిసరిగా రోజూ తీసుకోవాలి. కోడిగుడ్డులో పచ్చసొన తీసుకోకూడదనే అభిప్రాయాన్ని వదిలించుకోవాలి. ఎందుకంటే పచ్చసొనతో వచ్చే హానికరమైన కొలెస్ట్రాల్ కంటే, అది తీసుకోకపోతే కోల్పోయే పోషకాలే ఎక్కువ. ● రుతుస్రావం అవుతున్న సమయంలో ద్రవాహారం సమృద్ధిగా లభించేలా ఎక్కువ నీళ్లు తాగుతూ, కొబ్బరినీళ్లు తీసుకోవడం కూడా మంచిదే.

అస్సలు తీసుకోకూడనివి...

● బేకరీ ఐటమ్స్, కెఫిన్ మోతాదు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింక్స్ అస్సలు తీసుకోకూడదు.

చాలా పరిమితంగా తీసుకోవాల్సినవి...

● ఉప్పు ఎక్కువగా ఉండే పచ్చళ్లు, అప్పడాలు వంటి వాటినీ, కొవ్వులు ఉండే ఆహారాలను చాలా పరిమితంగా తీసుకోవాలి. ● కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ చాలా తక్కువగా తీసుకోవాలి.

మరికొన్ని సూచనలు

● రుతుస్రావం సమయంలో అమ్మాయిలు రక్తాన్ని ఎక్కువగా కోల్పోతుంటారు కాబట్టి ఎక్కువ మోతాదులో ఆహారం ఇవ్వాలంటూ పొరుగువారు, ఫ్రెండ్స్ చెబుతుంటారు. అది వాస్తవం కాదు. ఈ టీనేజ్‌లోనే అమ్మాయిలు తాము తీసుకునే క్యాలరీల వల్ల బరువు పెరుగుతుంటారు. అందుకే ఆహారం ఎక్కువగా తీసుకోవడం కంటే... ఆహారాన్ని ఎప్పటిలాగే తీసుకుంటూ ఐరన్ ఎక్కువగా ఉండే పదార్థాలూ తీసుకోవాలి.

● కొత్తగా రుతుస్రావం మొదలైన అమ్మాయిలకు కొబ్బరి, బెల్లం పెట్టాలంటారు. సంప్రదాయకంగా పెద్దలు చెప్పే ఆ ఆహారం పెట్టినా పరవాలేదు. అయితే కొబ్బరిలో, నువ్వుల్లో కొవ్వు పదార్థాలు ఎక్కువ. కాబట్టి వాటిని కాస్త పరిమితంగా తీసుకుంటూ ఉండాలి. ● నెయ్యికి బదులు వెన్న వాడటం మేలు. ఎందుకంటే వెన్నకాచి నెయ్యి చేశాక అందులో కొన్ని పోషకాలు తగ్గుతాయి. అయితే వెన్న తీసుకుంటే అందులోని కొవ్వులు... ఫ్యాట్ సాల్యుబుల్ విటమిన్స్‌ను బాగా ఒంటబట్టేలా చేస్తాయి. ● అన్నిటి కంటే ముఖ్యంగా పీరియడ్స్ సమయంలోనూ తేలికపాటి వ్యాయామం చేయడం అవసరమని తెలుసుకోవాలి. క్రమం తప్పకుండా రోజుకు 45 నిమిషాల చొప్పున కనీసం వారానికి ఐదు రోజుల పాటైనా వ్యాయామం చేస్తే హార్మోన్లు క్రమబద్ధంగా విడుదల కావడం జరుగుతోంది. అయితే కొంతమంది విషయంలో మాత్రం పీరియడ్స్ సమయంలో వ్యాయామం కుదరకపోవచ్చు. వాళ్లు మినహా మిగతా యువతులంతా వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.



డా. పూజితాదేవి సూరనేని
సీనియర్ హైరిస్క్ ఆబ్‌స్టెట్రీషియన్ & రోబోటిక్ సర్జన్

● నీ రీప్లేస్‌మెంట్ - రోబో



సునిశితంగా శస్త్ర చికిత్స

మోకాలి ఎముకల తాలూకు మృదులాస్థి (కార్టిలేజ్) అరిగాక... మోకాలి కదలికల్లో ఒకదానితో మరొకటి ఒరుసుకుంటే తీవ్రమైన నొప్పి రావడం... ఈ అరుగుదల తీవ్రత నాలుగో దశకు చేరాక మోకాలి మార్పిడి (నీ రీప్లేస్‌మెంట్ సర్జరీ) అవసరం ఏర్పడటం అందరికీ తెలిసిందే. ఇప్పటివరకు సంప్రదాయ పద్ధతుల్లో చేసే నీ రీప్లేస్‌మెంట్ చికిత్సల స్థానంలో ఇప్పుడు రోబో సహాయంతో శస్త్రచికిత్స (రోబోటిక్ సర్జరీ) వంటి అధునాతన పద్ధతులు అమల్లోకొచ్చాయి. ఈ నేపథ్యంలో రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీతో ఉండే సౌలభ్యాలూ, అనుకూలత గురించి తెలుసుకుందాం.

మోకాలి ఎముకల అరుగుదల అనేక విధాలుగా జరుగుతుంది. ఈ అరుగుదలను ఆర్థరైటిస్‌గా పేర్కొంటారు. ఇందులో దశలు ఉంటాయి. ఒకదశ దాటాక (నాలుగో దశ) ఇక మోకాలి మార్పిడి శస్త్రచికిత్స వల్లనే నొప్పి తగ్గుతుంది. గతంలోనూ... ఆ మాటకొస్తే ఇప్పుడు కూడా సాధారణ సంప్రదాయ పద్ధతుల్లో శస్త్రచికిత్సలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఇటీవల అనేక శస్త్రచికిత్స పద్ధతుల్లో వచ్చినట్టే మోకాలి మార్పిడి చికిత్సల్లో సైతం రోబోటిక్ సర్జరీ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అందునా ఇప్పుడు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో పని చేస్తూ... అత్యంత సునిశితంగా (ప్రెసిషన్‌తో) శస్త్రచికిత్స చేయగల సామర్థ్యం ఉన్న అత్యాధునిక రోబోల సహాయాన్ని వైద్యులు తీసుకుంటున్నారు. సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే ఈ అధునాతన పద్ధతిలో జరిగే శస్త్రచికిత్సతో ప్రయోజనాలేమిటో చూద్దాం.

● **కృత్రిమ పరికరాలు చాలాకాలం పాటు మన్నడం:** లోపల అమర్చాల్సిన పరికరాలను చాలా సునిశితత్వంతో అత్యంత ఖచ్చితమైన స్థానాల్లో అమర్చడం వల్ల అవి త్వరగా రాసుకుపోవడం, ఒరుసుకుపోవడం జరగవు. దాంతో చాలాకాలం పాటు మన్నికతో ఉంటాయి.

● **తక్కువ నొప్పి:** రోబోటిక్ శస్త్రచికిత్సలో నొప్పి చాలా తక్కువగా ఉంటుంది.

● **చాలా తక్కువ దుష్ప్రభావాలు:** చాలా ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స జరిగిపోవడం వల్ల ఇన్ఫెక్షన్ వంటి దుష్ప్రభావాలు రావడం చాలా తక్కువ.

● **టైలర్ సర్జికల్ అప్రోచ్:** అందరి దేహభాగాలూ, వాటితో పనిచేసే తీరుతెన్నులు ఒకేలా ఉండవు. దాంతో బాధితుల మోకాలి చుట్టూ ఉండే టెండన్లు, లిగమెంట్లు సరిగ్గా అమరిపోయేలా వారి అవసరాలకు తగ్గట్లుగా కృత్రిమ ఉపకరణాల రూపకల్పన, లోపల వాటి అమరిక అత్యంత ఖచ్చితత్వంతో జరగడంతో గతంలోని వారి వ్యక్తిగత అవయవం లాగానే మోకాలి భాగాలు అమరిపోతాయి. ఇంకా చెప్పాలంటే ఇలాంటి అత్యాధునిక రోబోల సహాయంతో చేసే శస్త్రచికిత్సలో సర్జన్ల ముందర బాధితుల తాలూకు మోకాలి 3-డి ఇమేజ్ స్పష్టంగా కనిపిస్తుంటుంది. సంప్రదాయ

మరింత ఎక్కువ సునిశితత్వం

చికిత్సల్లో ఇది అంత పూర్తిగా, స్పష్టంగా కనిపించకపోవచ్చు. ఫలితంగా కృత్రిమ మోకాలి ఎముకల భాగాల్ని అమర్చేటప్పుడు మునుపు ఉన్నట్లే సరిగ్గా అమరిపోయేలా అమర్చడానికి వీలవుతుంది.

వేగంగా కోలుకోవడం

రోబోటిక్ శస్త్రచికిత్స అత్యంత సునిశితత్వంతో జరగడంతో గాయం చాలా త్వరగా తగ్గుతుంది. ఇక దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) కూడా చాలా తక్కువగా ఉండటం ఫలితంగా చాలా వేగంగా కోలుకుని, చాలా త్వరగా ఇంటికెళతారు.



సంప్రదాయ చికిత్సలో శస్త్రచికిత్స చేసి లోపలి భాగాలను చూసేవరకు కండరాల పరిస్థితి అంతగా తెలియదు. అనుభవజ్ఞులైన శస్త్రచికిత్స నిపుణులు తమ అంచనా ప్రకారం శస్త్రచికిత్స నిర్వహిస్తారు. అయితే రోబోటిక్ సర్జరీలో కండరాల తీరుతెన్నులు శస్త్రచికిత్స ముందే స్పష్టంగా తెలుస్తాయి. ఫలితంగా ఖచ్చితమైన శస్త్రచికిత్సకు అవకాశం దొరుకుతుంది. దాంతో శస్త్రచికిత్స తర్వాత మోకాలు ముందుకూ వెనక్కు కదలడం (ఎక్స్‌టెన్షన్, ఫ్లెక్షన్) వంటి కదలికలు చాలా బాగుంటాయి. అందునా మోకాలి దగ్గర వంగడం అనేది సంప్రదాయ చికిత్స కంటే మరింత ఎక్కువగా ఉంటుంది. బాగుంటుంది. మోకాలు ఒంచేటప్పుడు సైతం నొప్పి చాలా తక్కువ.



డా. నీలం రమణారెడ్డి,
రోబోటిక్
నీ రీప్లేస్‌మెంట్ సర్జన్

ఎవరికి ఈ శస్త్రచికిత్సలు

గతంలో శస్త్ర చికిత్స చేయించుకుని విఫలమైనవాళ్లు (వీళ్లలో మోకాలి దగ్గర కదలికలు చాలా పరిమితంగా ఉండటం, కాలు కదిలిస్తున్నప్పుడు నొప్పి ఉండటం వంటి లక్షణాలుంటాయి), అరుగుదల చాలా ఎక్కువగా (సివియర్ ఆస్టియో ఆర్థరైటిస్) ఉన్నవారికి, రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతుండేవారికి, అలాగే ఇక నొప్పి నివారణ మందులూ, ఇతర చికిత్సలు పని చేయని వారికి ఈ రోబోటిక్ శస్త్రచికిత్స ఎంతగానో ఉపయోగపడుతుంది.